# పాపం... పాపాయమ్మ!!

పెసరట్ల పాపాయమ్మకు ఆ కాలనీలో పెద్దపేరుంది! ఆమెను ఎరుగని వారుండరు. ఇంటిముందు పొయ్యి పెట్టుకుని ఇడ్లీ... దోసెల వ్యాపారం ప్రారంభించి తాను జీవిస్తూ ఇద్దరు ఆడపిల్లలను ఎక్కదీసుకొస్తోంది. ఆమెకు జీవనాధారం ఆ చిన్న వ్యాపారమే !

పదేళ్లు సంసారం వెలగబెట్టి... ఇద్దరాడపిల్లలను అంటగట్టి... అకస్మాత్తుగ ఒకరోజు భర్త సుబ్బయ్య అదృశ్యమవటం పాపాయమ్మను కలవరపరిచింది. ఎన్నాళ్ళు పోయినా భర్త జాడేలేదు. చివరికి తిరిగొస్తాడనే ఆశకూడా పోయింది!. చచ్చాడో... బ్రతికున్నాడో కూడా తెలియరాలేదు.

పోలీసు రిపోర్టు... పేపర్లలో ప్రకటన ఇవ్వటాలు... టి.వీ.లో యాడ్ కోసం తాపత్రయపడటాల్లాంటి వాటి కోసం పాకులాడలేదు. భర్త తనపరం చేసిపోయిన ఆస్తిపాస్తులేం లేకపోవటం మూలాన... ఇంటిముందు పొయ్యి పెట్టుకుని బ్రతకటం తప్పలేదు.

తనకొచ్చిన విద్య వండి వార్చటమే కావటాన... దోసెల వ్యాపారం ప్రారంభించటానికి పాపాయమ్మ బిడియపడలేదు. ఏరోజు కారోజు సరుకు అప్పుతెచ్చుకుని... వ్యాపారం ముగిశాక లాభం తానుంచుకుని... పెట్టుబడి డబ్బులు సరుకుల దుకాణదారుడికిస్తూ తన మంచితనం నిరూపించుకోసాగింది.

పెళ్లినాడు పుట్టింటివారిచ్చిన డబ్బుతో ఓ వంద గజాల స్థలం చౌకరోజుల్లో కొనుక్కుని పాకవేసుకుని కాలక్షేపం చేస్తూ వచ్చిన పాపాయమ్మకు అదే ఘనమైన స్థిర ఆస్థి అయింది!.

పాపాయమ్మ దగ్గర ఇడ్లీ కారంపొడి, నెయ్యి కొబ్బరిచట్నీ అద్భుతంగ వుంటాయనే పేరు సంపాదించుకుంది. అదీకాక అల్లం పచ్చిమిర్చి ఉల్లిముక్కలు వేసిన ఆమె చేతి పెసరట్టు తింటే... సామిరంగ ఆ రుచి జన్మ జన్మలకు తిన్నవారు మచ్చిపోలేరు. పెసరట్ల కోసం పాపాయమ్మ పాకముందు క్యూకడతారు. ఎక్కడెక్కడి వాళ్లో... సైకిల్లమీద... స్కూటర్ల మీద పాపాయమ్మ దగ్గరకు ప్రత్యేకించి మూడు ముక్కల

నేతి పెసరట్టు కోసమే వస్తారు.

తాను తినో తినకో ఇద్దరాడపిల్లలను చదివిస్తోంది. తాను ముతక చీరెలు కట్టుకున్నా... చదువుకునే పిల్లలు కదాని వాళ్లిద్దరికీ మంచి డ్రెస్సులే కొని మురుస్తుంది. బిడ్డల భవిష్యత్ బాగుండాలనే తాపత్రయంతో అహర్నిశలు కష్టపడుతోంది.

కాలనీలో ఇళ్ల సంఖ్య పెరిగే కొద్దీ... పాపాయమ్మ మాత్రం తాను చేస్తున్న పనిలో జోక్యం చేసుకోనివ్వదు. చదువుమీదే దృష్టిపెట్టాలని కోరుకుంటూంటుంది. అయినా ఆడపిల్లలు కావటాన బడికి వెళ్లబోయేముందు... తిరిగి ఇంటికొచ్చాక... శలవుదినాల్లో తల్లికి చేదోడు వాదోడుగా వుంటున్నారు.

రాత్రి పొద్దుపోయేదాకా పిల్లలిద్దరూ కష్టపడి చదవటం చూస్తూ పాపాయమ్మ మురుస్తుంది. వీళ్లు పెద్దచదువులు చదవాలి... తానెంత కష్టపడైనా సరే పెళ్లిళ్లు ఘనంగా చేసి అత్తవారిళ్లకు పంపాలన్నదే పాపాయమ్మ ఆలోచన!

పెరిగే వ్యాపారానికి తన రెండు చేతులు చాలటం లేదు. వ్యాపారానికున్న డిమేండ్ తట్టుకోలేక మరో ఆడమనిషిని నెలజీతానికి పెట్టుకుంది. గ్రైండర్... గ్యాసు సిలిండర్ ఏర్పరచుకునే స్థాయికి ఎదిగింది.

ఈ దోసెల వ్యాపారం మీద వచ్చే ఆదాయంతోపాటు 'మెస్' కూడా నడపాలనే ఆలోచన వచ్చింది. తనకా వంట చేయటం వచ్చు! రోజుకో వందమందికైనా వండి వార్చగల శక్తివుంది తనకు.

ఆలోచన వచ్చిందే తడవు... కాలనీలో గల ఆడవాళ్లను సంప్రదించి ఆలస్యం చేయకుండా వ్యాపారం లాభసాటిగ వుండగలదనే భరోసాతో... తానుండే ఇంటిని పెంచింది. ఒక వాటా మెస్‌గాను.... మరోవైపు తాను వుండటానికి వీలుగాను ఏర్పాటు చేసింది.

డైనింగ్ టేబుల్సు... కుర్చీలు కొనేసింది. వంట సామాగ్రి ఏర్పరుచుకుంది. కాలనీ అంతటికీ తెల్సిపోయింది పెసరట్ల పాపాయమ్మ భోజన హెూటలు కూడా నడపబోతోందని.

భోజనంతోపాటు... కావలసిన వారికి కర్రీస్... చట్నీ సాంబారు వంటి ఐటమ్స్ కూడా అమ్మి డబ్బు చేసుకోనారంభించింది.

ఉద్యోగాలు చేసే బ్యాచ్‌లర్స్‌కు అతితక్కువ ధరకే భోజనం పెట్టి అందరినీ ఆకర్షిస్తోంది.

వింటే భారతమే వినాలి... తింటే గారెలే తినాలి... చేస్తే పాపాయమ్మ మెస్‌లోనే భోజనం చేయాలంటారు! ఎగబడుతుంటారు. కష్టమర్ల ఆదరాభిమానాలతో... అయిదేళ్లు తిరిగేసరికి పాక స్థానంలో ఆరుగదుల డాబా ఇల్లు కట్టించుకోకలిగే స్థాయికి ఎదిగింది. ఇద్దరాడపిల్లలకు చేతులకు బంగారు గాజులు.... మెళ్లోకి నగలు చేయించి పెట్టింది. తనూ ముతక నేత చీరెలు కట్టటం మానేసి ప్రింట్ చీరెలు కడుతోంది. బ్యాంకులో పిల్లల పేర ఫిక్స్‌డ్ డిపాజిట్లు వేయగలిగింది! ఇద్దరికీ చెరొక స్కూటీ కొనిచ్చింది.

హొటలు వ్యాపారమే కాకుండా కుదవ వ్యాపారం మొదలుపెట్టింది. కేవలం బంగారు వెండి వస్తువులు కుదవపెట్టుకుని అప్పివ్వసాగింది. పిల్లలు డిగ్రీలోకొచ్చేసరికి ఆర్థికంగ బలంపుంజుకుంది పాపాయమ్మ.

పాపాయమ్మ ఎదుగుదల చూసి కళ్లల్లో నిప్పులు పోసుకునేవారూ కాలనీలో ఎక్కువైనారు. ఇబ్బందుల్లో వున్నవారిని చూచి జాలిపడి వడ్డీకి ఆశపడకుండా చేబదులు ఇస్తూ తన మంచితనాన్ని చాటుకుంటూ వుంటుంది.

X X X

ఒకరోజు రాత్రి సమయంలో వెన్నెల్లో డాబామీద పడుకున్న కుమార్తెలిద్దరినీ సమీపించిన పాపాయమ్మ 'ఇంకా నిద్రపోలేదంటే మీరు...' అడిగింది.

'మమ్మీ! నువ్వు ఎన్నాళ్లని కష్టపడి వళ్లు హూనం చేసుకుంటావ్?... సంపాదించింది చాలదాఏం?. ఇక నువ్వు వ్యాపారం మానేసి రెస్ట్ తీసుకోవచ్చుగా...' పెద్దకూతురు లలిత అంది.

'నేపడే కష్టమంతా... మీ ఇద్దరి సుఖం కోసమే కదర్రా!?... నే చేసే పని నాకు కష్టమన్పించదు...'

'నువ్వట్లాగే అంటావ్! శక్తి క్షీణించి మంచాన పడితే నానా యాతన పడాల్సివస్తుంది... తెలుసా?-'

'ఏడిచావులే! నోరుముయ్యండి! మిమ్మల్ని అత్తారిళ్లకు సాగనంపేదాకా నాకీ

కష్టం... శ్రమ... తప్పదు!...' మంచంమీద వెల్లకిలా పడుకుని రిలాక్సైంది పాపాయమ్మ.

'మేము పెళ్లిళ్లు చేసుకోం... ఎప్పటికీ నీతోనే తోడుగా వుంటాము. నిన్ను ఒంటరిదాన్ని చేసి మేమెలా వెళ్లిపోతాం మమ్మీ!-' చిన్నపిల్ల రమ్య మారాం చేసింది.

'చాల్లే నోరుముయ్!...'

'అవునమ్మా... డాడీ లేకపోయినా నువ్వు వుండటంలేదా...?-' లలిత అన్నది.

'అబ్బబ్బ అవుతారా అనవసరపు మాటలు!... నేనెట్లావుంటేనేం?... బతుకుతెల్లారిపోతుంది. మీరు చిన్నపిల్లలు. మీకు మంచి భవిష్యత్ ముందుంది- మీరు పెళ్లి చేసుకుని... ప్లిలలను కంటూ... సుఖంగ సంతోషంగ వుంటే చాలు నాకు!-'

'పెళ్లొద్దంటే... అసలు చేసుకోమని కాదు మమ్మీ!- మేము వుద్యోగం చేస్తాం. తర్వాతే పెళ్లి... అదీ ఇష్టమైన వాడు... నచ్చినవాడు దొరికితేనే...'

ఆ మాట విన్న పాపాయమ్మకు ఏదో అనుమానం కలిగింది మనసులో.

'అవునే... మీరుగాని ప్రేమలో పడ్డారా ఏంటి కొంపతీసి!... ఎవరిబడితే వారిని నమ్మకండి. ప్రేమలోపడటం అంటే గోదాట్లోకి దూకినట్టే!. మునగటమేగాని తేలటమంటూ వుండదు. మగమనిషి తోడులేని సంసారం మనది. మీరు ఆకతాయి వేషాలు వేస్తే... అందరం నష్టపోతాం! ఎవరిని నమ్మాలో... ఎవరిని నమ్మకూడదో తెలియనిరోజులివి!. తెలివిగా మెలగండి. మంచిపిల్లలన్పించుకోండి!...' పడుకున్నదల్లా లేచి కూర్చుని పక్కనేవున్న కూతుళ్ల భుజాలమీద చేతులు వేసి ఆప్యాయంగ దగ్గరకు తీసుకున్న పాపాయమ్మ కంఠం ఆర్ద్రమైంది. కంట్లో నీరు తొణికిసలాడింది.

'మాగురించి అనవసరంగ ఆలోచిస్తూ నీ మనసు పాడుచేసుకోకు మమ్మీ... బాగా పొద్దుపోయింది... పడుకుని నిద్రపో... మళ్లీ తెల్లారితే హోటలు పన్లు నీకోసం ఎదురు చూస్తుంటయ్....' లలిత అంది.

తల్లీ కూతుళ్లు వెన్నెల్లో చల్లగాలికి నిద్రకు వుపక్రమించారు.

X X X

'కాలేజీలో అందరూ మమ్మల్ని పెసరట్ల పాపాయ్మ కూతుళ్లాని ఆటపట్టించి ఏడిపిస్తూంటారమ్మా...' టిఫిన్ చేస్తూ తల్లితో అంది రమ్య!.

'అనుకోనీయండే... మీకొచ్చిన నష్టమేమిటంట?!-'

'చిన్నతనంగ వుంటోంది మమ్మీ....' లలిత కూడా శృతికలిపింది.

'ఇంకా ఎన్నాళ్లులే... ఈ ఏటితో మీ చదువు పూర్తి అవుతుంది. ఆ తర్వాత మిమ్మల్ని ఆపేరుతో ఏడిపించేవారే వుండరు... త్వరగా తెమిలి కాలేజీకి లంచ్ బాక్స్ తీసుకుని బయలుదేరండి... టైమౌతోంది...'

కూతుళ్లిద్దరినీ కాలేజీకి తరిమింది పాపాయమ్మ! ఆతర్వాత ఆలోచనలోపడింది. పిల్లల మాటల ధోరణిలో... చేతల్లో... ఏదో తేడా కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది తనకు. అదేమైందీ అంతుబట్టకుండా వుంది ఎంత ఆలోచించినా...!!

కాలేజీ చదువంటేనే... వెంటబడి వేధించే కుర్రాళ్లబారిన పడక తప్పదు. ఎంతటి ధైర్యవంతులకైనా ఇబ్బందులు తప్పవ్. మగపిల్లల ఆకతాయి చేష్టలకు ఆడపిల్లలు బలైపోవటం టి.వీ.ల్లో చూస్తూనేవున్నాం.

ఆడపిల్లలు ఎంత బుద్ధిమంతులనైనా... ప్రేమంటూ వెంటబడటాలు...కాదంటే.. యాసిడ్ దాడి చెయ్యటం... లేదూ కిడ్నాప్‌చేసి సామూహిక అత్యాచారానికి పాల్పడటం వంటివి సర్వసాధారణమైనయ్.

ఇలాంటి ఆపదలు... కష్టాలు.. తనకూతుళ్లకు దాపురించకుండా కాపాడు భగవంతుడాని దేవుళ్లకు రోజూ దణ్ణాలు పెట్టుకుంటునేవుంది పాపాయమ్మ.

ఈరోజుల్లో ఆడపిల్లలను పెంచటమంటే సాధారణమైన విషయం కాదు. ఎంత ఒదిగివున్నా మగపిల్లల వేధింపులకు గురవక తప్పటంలేదు... ఓరినాయనోయ్... వాటిని గురించి తల్చుకుంటే... వళ్లు జలదరిస్తుంది... రోజులు తిన్నగ గడవనీ భగవంతుడా మగదిక్కులేని ఆడదాన్ని... ఇన్నాళ్లూ... గౌరవంగ బ్రతుకుతున్న దాన్ని... నీవే దిక్కు మాకు... తనను తాను ఓదార్చుకుంది. మనసుకు ధైరం చెప్పుకుంది!.

X X X

తమ లవ్ ఎఫైర్ గురించి తల్లికి ఎలా తెలియచెప్పటమాని యోచిస్తున్నారు ఇద్దరు సిస్టర్స్!. మమ్మీతో ప్రస్తావిస్తే ఒకపట్టాన ఒప్పుకుంటుందా?... గరిటె కాల్చి వాతలు పెడుతుందా?

ఫైనలియర్ ఎగ్జామ్స్ దగ్గర్లో కొచ్చినయ్! ప్రేమ విషయం ఇప్పుడు చెప్పటం

మంచిది కాదన్పించింది. తర్వాత చెప్పినా తమ ప్రతిపాదన అంగీకరిస్తుందనే నమ్మకం లేదు.

పోనీ... మమ్మీకి చెప్పకుండా పెళ్లి చేసుకుంటే...? ఈ నిజాన్ని ఎన్నాళ్లని దాచగలరు?- ఏనాటికైనా బైటపడక తప్పదు. ఏది ఏమైనా ఆలస్యం అమృతం విషం కాకూడదనుకుని రాత్రి భోజనాల సమయంలో తల్లికి చెప్పేటందుకే ఇద్దరు ప్రిపేరైనారు.

'ఏంటమ్మాళ్లూ... కంచంలో అన్నం వడ్డించి పదినిముషాలైనా... ఎన్నిసార్లు పిల్చినా రారేమర్రా?... అన్నం మీద అలక కూడదు. కడుపులో ఆకలి ఎలుకలు పరుగెత్తటంలేదా?...' కేకలు పెట్టింది పాపాయమ్మ.

'వస్తున్నాం పె.పా. గారూ...' అంటూ కిచనోకొచ్చారు సిస్టర్స్ ఇద్దరూ.

పె.పా. గారేంటే?- నాకేదో కొత్తపేరు పెట్టారా ఏమిటి?-' పిల్లల ముఖంలోకి ప్రశ్నార్థకంగ చూచింది.

'నీకున్న పాతపేరేలే మమ్మీ...' లలిత అంది.

'అదేమిటో చెప్పేడవండి..'

''పె' అంటే పెసరట్లు... 'పా'... అంటే పాపాయమ్మ అని అర్థం...' రమ్య వివరించింది.

'మీకు పొగరెక్కి తన్నుకుంటున్నారర్రా... కన్నతల్లితో ఎకచక్కాలేంటి?-' కళ్లు పెద్దవి చేసింది.

'సారీ మమ్మీ... వెరివెరి సారీ...'

'సరేసరే... మీ అల్లరి మరీ ఎక్కువౌతోంది రాను... రాను... కానీండి... తినటం మొదలుపెట్టండి...'

'మమ్మీ నీతో ఓ సీక్రెట్ చెప్పాలి...' రమ్య అంది.

ఇద్దరూ కూడబలుక్కున్నారా?- ఏమిటా విషయం?- దేనిగురించి...?-' పప్పు వడ్డిస్తూ అడిగింది పాపాయమ్మ.

'చెప్పిన తర్వాత నువ్వు కోపగించుకోనంటేనే చెప్తాం...' అంది లలిత.

'అర్థమైందిలే... మీ పరీక్షలయ్యాక మన వ్యాపారం మానేయటం గురించేగా?... ఇంకా టైము చాలావుంది... అప్పుడు ఆలోచిద్దాంలే...'

'చదువు అవగానే మాకు పెళ్లిళ్లు చేస్తానంటున్నావ్ కదా...' రమ్య అంది.

'అవునూ... కట్నం క్రింద డబ్బు కూడా బ్యాంక్‌లో డిపాజిట్ రూపంలో రెడీగ వుంది. ఇక సంబంధాలు ఇద్దరికీ వెతికి వెంటనే పెళ్లి చేసి అత్తవారిళ్లకు పంపటమే...'

'మమ్మీ!... చిన్న సవరణ...' లలిత అంది.

'ఏమిటది?-' నొసలు చిట్లించింది

'మా పెళ్లి ఇప్పుడే చేసెయ్... ఇప్పుడంటే... అదేలే పరీక్షలవగానే అన్నమాట... అదీ... మే ప్రేమిస్తున్న వారితో'

రమ్య మాటలు విన్న పాపాయమ్మ నివ్వెరపోయింది.

'అంటే... మీరు...'

'ప్రేమలో పడ్డాం!-' ముక్త కంఠంలో అన్నారు.

'మాకు నచ్చిన... మేము లవ్ చేస్తున్న అబ్బాయిలకిచ్చి మా పెళ్లిళ్లు చేయమ్మా...' బ్రతిమిలాడింది లలిత.

'ఖర్మ!... ఖర్మ!- నేననుకున్నంతా జరిగింది. మీరు ఇట్లా కొంపముంచుతారనుకోలేదు. పైకి బుద్ధిమంతులుగా నటిస్తూ... మీరు చేసే వెధవ పన్లు ఇవా?- మీ మాటలు నాకు నచ్చలేదు-నేనందుకు వప్పుకోను. ఆ కుర్రాళ్లు ఎలాంటి వారో? బుద్ధిమంతులవునోకాదో?... అయినా మీ పిచ్చి వేషాలు నాకు నచ్చవ్... మీ ఇష్టం వచ్చినట్టు మీరు తొందరపడుతూంటే... నేను ఏ నుయ్యో... గొయ్యో చూసుకుంటాను. మీ ఇష్టం మీదైతే... నా నిర్ణయం నాది!. నేను చచ్చాక మీ ఇష్టమొచ్చినట్టు చేసుకోండి...' కళ్లనీళ్లు పెట్టుకున్న పాపాయమ్మ కిచన్లోంచి విసవిసా నడుచుకుంటూ వెళ్లిపోయింది.

XXX

ఆఖరు పరీక్షరాసిన పిల్లలిద్దరూ చీకటిపడినా ఇల్లు చేరుకోక పోవటంతో కంగారుపడింది పాపాయమ్మ! కళ్లల్లో వత్తులేసుకుని తెల్లవారి వాళ్లకోసమే అన్నమైనా తినకుండా ఎదురుచూస్తూ కూర్చుంది వీధిగుమ్మం దగ్గరే!

ఇంతలో తొమ్మిది గంటల సమయంలో ఇంటి ముందు పోలీసు జీపు ఆగటం చూచి బెదిరిపోయింది.

పోలీసు కానిస్టేబుల్ లోనికొచ్చి... 'కృష్ణ వొడ్డున ఇద్దరాడపిల్లల శవాలు పడివున్నయ్!. వాళ్ల పుస్తకాల్లో ఇంటి అడ్రసు రాసివుండటంతో మీకు సంబంధించిన వారైవుంటారని వచ్చాం! మీరు మా వెంట వచ్చి... శవాలు మీవి అవునో కాదో గుర్తించాల్సివుంటుంది. మా ఎస్సైగారు వెంట పెట్టుకు రమ్మన్నారు...' గడగడా పాఠం అప్పగించినట్టు మాట్లాడాడు.

పాపాయమ్మ ఆమాట వినగానే పై ప్రాణాలు పైనే పోయినట్టన్పించింది. గుండెలు బాదుకుంటూ... లబోదిబోమంటూ జీపెక్కింది.

కృష్ణ ఒడ్డున వున్న ఎస్సై వద్దకు పరుగు పరుగున వెళ్లి 'ఏంజరిగిందండీ....' అడిగింది.

శవాలను చూపిస్తూ 'ఈ ఇద్దరూ మీ పిల్లలేనా?-' అడిగాడు.

శవాలనున పరీక్షగా చూచి రోదిస్తూ 'అవునండీ నాకున్నది ఈ ఇద్దరు పిల్లలేనండి....' అంది పాపాయమ్మ.

'ప్రేమించిన వాళ్లు మోసం చేశారని... తొందరపడిన కారణం తల్లి కాబోతున్నందున... కన్నతల్లికి లోకానికి ముఖం చూపలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నాం. మమ్మల్ని క్షమించు మమ్మీ...' అని వుత్తరం రాసిపెట్టి ఇద్దరూ సంతకాలు పెట్టిన ఈ లెటర్ వాళ్ల పుస్తకంలో దొరికింది.

మొగుడు లేకపోయినా మీరే నారెక్కలనుకుని బతుకుతున్నదాన్ని... నన్ను అన్యాయం చేసి మీ దోవ మీరు చూసుకున్నారా పిల్లలూ... ఇక నేనెందుకు బతకాలి? ఎవరికోసం బతకాలి... అని ఏడుస్తూ గుండెలు బాదుకుని క్రిష్ణ వడ్డునే కుప్పకూలింది పాపం... పాపాయమ్మ !

---సమాప్తం---